ఈనాడు
జయశంకర్ భూపాలపల్లి

ఉపాధ్యాయుల కొరత.. విద్యార్థుల వెత

జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత సమస్య వేధిస్తోంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గురువులు లేకపోవడంతో విద్యా బోధన అస్తవ్యస్తంగా మారింది. కొన్ని పాఠశాలల్లో ఒక ఉపాధ్యాయుడే బోధిస్తుండటంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏటా డీఈవో కార్యాలయం నుంచి తాత్కాలిక పద్ధతిలో సర్దుబాటు చేసినా.. లిఖితపూర్వక ఆదేశాలివ్వకపోవడంతో కేటాయించిన పాఠశాలలకు వెళ్లేందుకు ఉపాధ్యాయులు ఆసక్తి చూపేవారు కాదు. ఈ నేపథ్యంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని ఆదేశిస్తూ.. విద్యాశాఖ కలెక్టర్లకు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించింది. జిల్లాలో కొన్ని పాఠశాలల్లో తక్కువ మంది ఉపాధ్యాయులు ఉండగా.. కొన్ని చోట్ల విద్యార్థులు తక్కువ మంది ఉన్నప్పటికీ ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్నారు. ఇలాంటి పాఠశాలలకు గురువులను సర్దుబాటు చేయాల్సి అవసరం ఉంది. – న్యూస్‌టుడే, భూపాలపల్లి

పరిశీలన

ఏకోపాధ్యాయ పాఠశాలల్లో..

అటవీ గ్రామాల్లోని ఏకోపాధ్యాయ పాఠశాలల్లో తరగతుల వారీగా పాఠాలు చెప్పడం గగనమవుతోంది. పలు చోట్ల అన్ని తరగతుల విద్యార్థులను ఒకే దగ్గర కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. ఒక తరగతికి బోధించే సమయంలో వేరే తరగతుల విద్యార్థులు ఖాళీగా కూర్చోవాల్సి వస్తోంది. కొన్నిసార్లు ఉపాధ్యాయులు సెలవు పెట్టినప్పుడు.. ఉన్నతాధికారులు సమీప పాఠశాలల నుంచి గురువులను పంపిస్తున్నారు. జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలను బుధవారం 'న్యూస్‌టుడే' పరిశీలించింది. ఆ వివరాలివి..

వేరే పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు



- పాఠశాల : ప్రాథమికోన్నత, పలిమెల మండలం
- విద్యార్థుల సంఖ్య: 86
- ఎంతమంది ఉపాధ్యాయులు అవసరం: ముగ్గురు
- ప్రస్తుతం ఎంతమంది గురువులు ఉన్నారు : చాలా కాలం నుంచి ముగ్గురే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఇద్దరు ఉపాధ్యాయులు ఇక్కడికి రావాల్సి ఉండగా వారు వేరే పాఠశాలకు వెళ్లారు.

మంజూరు కాని పోస్టులు



- ప్రభుత్వ ఉన్నతపాఠశాల, గోపాలపురం, చిట్యాల మండలం
- 22
- ఐదుగురు
- ప్రస్తుతం ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు. మూడేళ్ల క్రితం ప్రాథమిక పాఠశాలను ఉన్నతపాఠశాలగా ఉన్నతీకరించారు. కానీ పోస్టులను మంజూరు చేయలేదు. దీంతో ఉపాధ్యాయులు లేరనే కారణంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించటం లేదు.

జిల్లాలో గురువుల వివరాలివి..	
మంజూరైన పోస్టులు	1,829
పనిచేస్తున్న వారు	1,392
ఖాళీలు	437

విద్యార్థులు 21 మంది.. ఉపాధ్యాయులు ఏడుగురు



- ప్రభుత్వ ఉన్నతపాఠశాల, మీనాజీపేట, మహాముత్తారం మండలం
- 21 ● ఒకరు ● ప్రస్తుతం ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో ఇక్కడి ఉపాధ్యాయులను వేరే పాఠశాలకు సర్దుబాటు చేయాల్సి ఉంది. పిల్లల సంఖ్య పెంచితేనే ఈ బడికి అదనపు ఉపాధ్యాయులు అవసరం.

సర్దుబాటు చర్యలు చేపట్టాం

– రాజేందర్, డీఈవో

విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాత్కాలిక పద్ధతిలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తున్నాం. ఇప్పటికే కొంత మందిని సర్దుబాటు చేశాం. మరి కొన్ని చోట్ల చేయాల్సి ఉంది. ఇంకా ఉపాధ్యాయుల కొరత ఉన్న ప్రదేశాలకు వేరే వారిని పంపిస్తాం.

ఖాళీగా రెండు పోస్టులు



- ప్రభుత్వ ఉన్నతపాఠశాల, వెంకట్రావుపల్లి (బీ), టేకుమట్ల మండలం ● 43 ● ఇద్దరు
- పాఠశాలలో ప్రస్తుతం ఐదుగురు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. బదిలీల ప్రక్రియతోనే ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. దీంతో 9, 10 తరగతుల విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన సక్రమంగా సాగడం లేదు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు, చిత్రంలో ఎస్పీ కిరణ్‌ఖరే, కలెక్టర్ రాహుల్ శర్మ

చెల్పూర్(గణపురం), న్యూస్‌టుడే: సీసీ కెమెరాలు శాంతి భద్రతల పరిరక్షణలో ముఖ్యపాత్ర పోషిస్తాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గణపురం మండలం చెల్పూర్‌లో బుధవారం సీసీ కెమెరాల ప్రారంభోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.6 లక్షలతో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకొచ్చిన గ్రామస్థులను అభినందించారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయన్నారు. విడతల వారీగా నియోజకవర్గ వ్యాప్తంగా కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. గుడెప్పాడ్ నుంచి చెల్పూర్ వరకు రూ.660 కోట్లతో రహదారి విస్తరణ పనులు చేపడతామన్నారు. చెరువులు ఆక్రమణకు గురికాకుండా రక్షణ చర్యలు చేపడుతున్నామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ నేరాలు జరిగినప్పుడు సీసీ కెమెరాల సాయంతో నిందితులను వెంటనే గుర్తించవచ్చన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, ప్రధాన కూడళ్లలో కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. కెమెరాల ఏర్పాటుకు ఆర్థికసాయమందించిన దాతలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రకాశ్‌రెడ్డి, ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఎస్పీ సంపత్‌రావు, సీఐ మల్లేశ్, ఎస్సై అశోక్, చెల్పూర్ పీఏసీఎస్ ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

కోటగుళ్ల శిల్ప సంపద అద్భుతం



కోటగుళ్లలో పూజలు చేస్తున్న రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ గిరిధర గోపాల్

గణపురం, న్యూస్‌టుడే: గణపురంలో కోటగుళ్ల శిల్ప సంపద అద్భుతమని రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ గిరిధర గోపాల్ అన్నారు. ఆయన బుధవారం తన కుటుంబ సభ్యులతో కలిసి కోటగుళ్లను సందర్శించారు. స్థానిక పూజారి కేయుడు తాళ్లపల్లి యాదగిరి ఆయనకు ఆలయ విశిష్టతను వివరించారు. గిరిధర గోపాల్ మాట్లాడుతూ కోటగుళ్లతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, గతంలో ములుగు సబ్ కలెక్టర్‌గా, ఐటీడీఏ పీవోగా పని చేసినప్పుడు అందరి సమన్వయంతో మేడారం జాతర నిర్వహించానన్నారు. రామప్పను పోలిన శిల్ప సంపద ఇక్కడుందని, మరోసారి కోటగుళ్లను సందర్శిస్తానన్నారు. కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజేందర్, ఆర్ఐ దేవేందర్, రహమత్ పాషా తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా సుభాకర్‌రెడ్డి



భూపాలపల్లి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని బుధవారం పీఆర్‌టీయూ జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా రేగూరి సుభాకర్ రెడ్డి మూడో సారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం రాష్ట్ర కమిటీ నాయకుడు కూర రఘోత్తంరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.లక్ష్మణ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా కె.కిరణ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. 11 మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శిలను ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ నాయకులు అభినందించారు.

వర్షాల వేళ.. ఒడిసిపడదాం!

ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వ ఉత్తర్వులు





దాహం వేసినప్పుడే ఆలోచిద్దామా..?

ఇప్పుడు వర్షాలు పడుతున్నాయి.. నీరంతా వృథాగా సముద్రం పాలవుతోంది.. కాంక్రీట్ వనంలో చుక్క నీరు కూడా ఇంకడం లేదు.. మళ్లీ వేసవి వచ్చేవరకు తాగునీటికి కటకటే.. అప్పుడు ఇంకుడు గుంతలు గుర్తుకొస్తాయి.. దాహం వేసినప్పుడే.. బావి తవ్వితే ప్రయోజనం ఉంటుందా..? మరేం చేద్దాం..!

ఇదే తరుణం...

తాజాగా వాన నీటిని ఒడిసిపట్టి.. భూగర్భ జలాల పెంపునకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ నడుం బిగించింది. అన్ని పురపాలికలు, నగరపాలక సంస్థల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, 300 చదరపు మీటర్లకు మించిన అన్ని నిర్మాణాల్లో ఇంకుడు గుంత ఉండాలని ఉత్తర్వులు వెలువరించింది.. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగంతో పాటు ఇటు పౌరులూ కదలాలి.

పౌరుల మేలుకొలుపు కోసం..!

నగర పాలక సంస్థతో పాటు పురపాలికల్లో పౌరుల మేలుకొలుపు కోసమన్నట్లు ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారు. జల శక్తి అభియాన్ పథకం కింద 'క్యాచ్ ది రెయిన్' పిలుపుతో ఈ కార్యాచరణ అమలు చేశారు. డోర్నకల్‌లో మున్సిపల్ పాలకవర్గం, ఉద్యోగులు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.

బాధలన్నీ గట్టెక్కాయి..

ఈ దంపతుల పేర్లు ధారియా-రామిని... మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చాప్లాతండా వాసులు. వీరింట్లో బోరు నుంచి అంతంతమాత్రంగానే నీరు వచ్చేది. ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టాక ఇంటి అవసరాలకు సరిపడా నీరొస్తోంది.. ఇంట్లో వాడిన నీళ్లు నేరుగా ఇంకుడు గుంతలోకి వెళ్తుండటంతో దోమలు, విష పురుగుల బాధ తప్పింది.

న్యూస్‌టుడే–డోర్నకల్, కార్పొరేషన్, జనగామ

భవనాల నిర్మాణాలకు అనుమతిచ్చేటప్పుడే ఇంకుడుగుంత ఉండేలా తప్పని చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ మేరకు విధివిధానాలను పొందుపర్చింది. ఇప్పటికే ఉన్న భవనాల్లోనూ నిర్మించాలి. విద్యా సంస్థలు ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, అపార్టుమెంట్లు, ప్రైవేటు వాణిజ్య భవనాల్లోనూ తప్పనిసరి. బడా భవనాలకు ఆక్యుపెన్సీ కమ్ కంప్లీషన్ సర్టిఫికెటు ఇచ్చే ముందు ఇంకుడుగుంత నిర్మించారో లేదో అధికారులు పరిశీలించాలి.

డిపాజిట్ వెనక్కి తీసుకున్నవారే లేరు..

భవన నిర్మాణ అనుమతి రుసుములో ఇంకుడు గుంతల డిపాజిట్ చెల్లించి, నిర్మాణం పూర్తయిన పిదప, ఇంకుడు గుంతల డిపాజిట్ రుసుమును వెనక్కి తీసుకోవచ్చు. కానీ, పురపాలికల్లో ఇంకుడు గుంతలు నిర్మించి, రుసుము వెనక్కి తీసుకున్న దాఖలాలు తక్కువే..

మూలుగుతున్న రూ.5 కోట్లు

ఇంకుడు గుంతల నిర్మాణం కోసం గ్రేటర్ వరంగల్ డబ్బులు వసూలు చేసింది. బిల్డింగ్ పర్మిషన్ ఫీజుతో పాటు వాటర్ హార్వెస్టింగ్ ఛార్జీలు తీసుకున్నారు. నివాస గృహాల నుంచి రూ.5 వేలు, అపార్టుమెంట్లు, వ్యాపార, వాణిజ్య భవనాల నుంచి రూ.10వేల పైనే వసూలు చేశారు. 2003 నుంచి నిధులను ప్రత్యేక ఖాతాలో జమ చేశారు. ఇలా రూ.5 కోట్ల నిధులు మూలుగుతున్నాయి. 2013, 2018లో స్పెషల్ డ్రైవ్ ద్వారా కొంతమంది యజమానులు ఇంకుడు గుంతలు నిర్మించినా అసంపూర్తిగా వదిలేశారు.

కానరాని చైతన్యం

పట్టణ ప్రజల్లో చైతన్యం కానరావడం లేదు.. భవన నిర్మాణం జరిగిన చోటల్లా ఇంటి ఆవరణ లేదా పరిసరాల్లో ఇంకుడు గుంత నిర్మాణమనేది నామ మాత్రంగా కనిపిస్తోంది.. ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లో మూడు నెలల క్రితం అధికారులు ఇంటింటా సర్వే చేశారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో 300 చదరపు మీటర్లు దాటిన గృహాలు 11,588 ఉన్నాయి. ఇందులో 6,973 ఇళ్లు సర్వే చేయగా.. కేవలం 789 ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించగా 768 వాడకంలో ఉండగా, 21 నిరుపయోగంగా ఉన్నాయి. 6184 ఇళ్లలో లేవని తేలింది.

ఇలా నిర్మిద్దాం

ఇంట్లో వాలు స్థలం ఎంపిక చేసుకోవాలి. అనువైన పొడవు, వెడల్పుతో 2 మీటర్ల లోతు గుంత తవ్వాలి. అడుగు భాగాన సగభాగం 40 మి.మీ కంకర, తర్వాత పావు భాగం 20 మి.మీ కంకర నింపాలి. గుంత కొంత భాగం ఖాళీగా ఉండేలా చూసుకొని దొడ్డు ఇసుకతో నింపాలి. తర్వాత వర్షపు నీటి పైపును ఇంకుడు గుంతలోకి మళ్లించాలి. ఇళ్లలో ఖాళీగా ఉన్న బోర్లను కూడా ఇంకుడు గుంతలా చేసి నీటిని మళ్లించవచ్చు.



ఉమ్మడి జిల్లాలో పరిస్థితి ఇదీ	
పట్టణాల్లో ఆవాసాలు	3,51,768
అపార్టుమెంట్లు	687
ఇంకుడు గుంతలు	2146

దీర్ఘ కాలికంగా ఉండేలా మేడారం పనులు



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి సీతక్క

ములుగు, న్యూస్‌టుడే: మేడారం జాతరలో చేపట్టే పనులు దీర్ఘకాలికంగా ఉపయోగపడే విధంగా ఉండాలని మంత్రి సీతక్క అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో మినీ మేడారం జాతర నిర్వహణపై కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరిష్, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. రూ. వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్న అవి శాశ్వతంగా ఉండకపోవడంతో మళ్లీ ఆ పనులను చేపట్టే పరిస్థితి వస్తోందని, ఇప్పటి నుంచి చేపట్టే పనులు దీర్ఘకాలికంగా ఉండేలా చేయాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం స్పర్శ్ పథకం ద్వారా జాతరకు నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఫ్లోరింగ్ పనులతో పాటు మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు వసతులు కల్పించాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందని స్పష్టం చేశారు. జిల్లా అధికారులు గతంలో పని చేసిన అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. తాను స్థానిక ఎమ్మెల్యేగా జాతర అదనపు నిధులు కోసం కృషి చేస్తానని తెలిపారు. జిల్లాకు డైనమిక్ కలెక్టర్ రావడం జిల్లా ప్రజల అదృష్టమన్నారు. 2024 జాతర సమయంలో చేపట్టిన పనుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు కలెక్టర్‌లు సీహెచ్. మహేందర్‌జీ, సంపత్‌రావు, మేడారం ఈవో రాజేందర్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య, పంచాయతీ రాజ్, ఆర్ అండ్‌బీ, గిరిజన సంక్షేమం, నీటిపారుదల, విద్యుత్తు శాఖ అధికారులు పాల్గొన్నారు.

28న జాతీయ లోక్ అదాలత్

భూపాలపల్లి, న్యూస్‌టుడే: ఈ నెల 28న జిల్లా కోర్టు ప్రాంగణంలో జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కిరణ్ ఖరే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం జరుగుతుందన్నారు. చిన్న చిన్న కేసులతో కోర్టుల చుట్టూ తిరిగితే సమయం, డబ్బులు వృథా అవుతాయన్నారు.

అధునాతన సేవలపై అవగాహన అవసరం

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: 108, 102, 1962 వాహనాల సిబ్బంది ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా మేనేజర్ శివకుమార్ అన్నారు. ఆయన బుధవారం జిల్లా కేంద్రంలోని టోల్‌ఫ్రీ నెంబర్ అంబులెన్సులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అంబులెన్స్‌ల్లో ఏర్పాటు చేసే అధునాతన సేవలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బాధితులను సకాలంలో ఆసుపత్రులకు తరలించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ మెరుగు నరేశ్, ఈఎండీ సుధాకర్, పైలెట్ హరిబాబు, మంజూల, ప్రవీణ్, స్వామి, రియాజ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీహబ్‌లో వైద్యపరీక్షలు పెంచేందుకు కృషి



మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే: మొగుళ్లపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రంగాపురం, ఇస్సిపేటలోని ఉప ఆరోగ్యకేంద్రాలను, అంగన్‌వాడీ కేంద్రాలను పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మధుసూదన్ తనిఖీ చేశారు. రికార్డులను, మందుల నిల్వలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల వయస్సులకు తగినట్లుగా వారి బరువు, ఎత్తు ఉండేలా చూడాలని, పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీహబ్ వైద్య పరీక్షలను పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి నాగరాణి, డాక్టర్ నవత, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



చెట్టు వద్ద శుభ్రం చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు, జడ్జి రాంచంద్రారావు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యం లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో బుధవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా న్యాయమూర్తి, జిల్లా జడ్జి, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పరిసరాలను శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలను, చెత్తా చెదారాన్ని తొలగించారు. మొక్కల వద్ద గడ్డిని తొలగించారు. ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో జడ్జిలు జయరాంరెడ్డి, రాంచంద్రారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మౌంట్ గోరీచెన్ పర్వతాన్ని అధిరోహించిన యశ్వంత్


జాతీయ పతాకంతో యశ్వంత్

మరిపెడ, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన పర్వతారోహకుడు భూక్యా యశ్వంత్ ఇటీవల అరుణాచల్ ప్రదేశ్‌లోని మౌంట్ గోరీచెన్ పర్వతాన్ని అధిరోహించి మరో ఘనత సాధించారు. అతి పిన్న వయసులో ఈ ఘనత సాధించిన వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. మరిపెడ మండలం భూక్యాతండాకు చెందిన యశ్వంత్ పట్టుదల, కృషి, ఆసక్తితో ప్రపంచంలోని శిఖరాలను అధిరోహిస్తున్నారు. సెప్టెంబర్ 4న ప్రారంభించిన యాత్ర 6488 మీటర్ల ఎత్తైన శిఖరాన్ని 18 రోజుల్లో అధిరోహించి కిందకు దిగినట్లు యశ్వంత్ పేర్కొన్నారు. ఎవరెస్ట్ అధిరోహించాలనే సంకల్పంతో ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తున్నట్లు పేర్కొన్నారు. అసోం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య యశ్వంత్‌కు అభినందనలు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సాహస అభిమానులు యశ్వంత్‌కు ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి


ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రవీందర్, పీఆర్‌టీయూ నాయకులు

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల సాధన కోసం పీఆర్‌టీయూ కృషి చేస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలోని జడ్పీ సమావేశ మందిరంలో సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. శ్రీపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంఘం కృషితోనే ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు జరిగాయని చెప్పారు. సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణకు ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ మాట్లాడుతూ.. టీచర్ల సమస్యలు, పాత బకాయిల చెల్లింపులపై సీఎంను కలుస్తామని అన్నారు. అనంతరం వరంగల్ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఈదునూరి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎండీ.అబ్దుల్ గఫార్, అసోసియేట్ అధ్యక్షులుగా కె.రఘు, ఎ.మహేందర్, ఉపాధ్యక్షులుగా పి.మల్లయ్య, సి.సుధాకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలిగా పి.అర్పితలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్, మాజీ ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్, ప్రతిక సంపాదకులు ఇన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, మండల బాధ్యులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)
వెన్‌కాబ్

ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

లక్ష్యం వైపు దూసుకెళ్తున్నారు!

ప్రతిభ గల పేద క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తే.. అద్భుతంగా రాణిస్తారనడానికి ఉదాహరణ ఇది.. సరైన నైపుణ్య శిక్షణ అందిస్తే చక్కటి ఫలితాలు వస్తాయనడానికి తార్కాణమిది.. 'ఈనాడు' సంస్థ తీసుకొచ్చిన 'లక్ష్య' కార్యక్రమం మారుమూల క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకొస్తోంది. .. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడకు చెందిన జీవాంజీ దీప్తి 'లక్ష్య' ప్రోత్సాహంతో పారిస్ పారాలింపిక్స్‌లో ఏకంగా కాంస్య పతకం కొల్లగొట్టింది. ఆమె స్ఫూర్తిగా హనుమకొండ కేంద్రంగా శిక్షణ తీసుకుంటున్న అథ్లెట్లు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలతో దుమ్మురేపుతున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పది పతకాలతో అదరగొట్టారు. ఈ నేపథ్యంలో వారిపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

–న్యూస్‌టుడే, వరంగల్ క్రీడావిభాగం

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పది పతకాలు

చిరుత వేగంతో..


మహ్మద్ కైఫ్

హుజూరాబాద్‌కు చెందిన స్ప్రింటర్ మహ్మద్ కైఫ్ పరుగులో చిరుత వేగంతో పోటీపడతారు. చిన్నప్పటి నుంచి క్రీడలపై ఆసక్తి ఉండటంతో అథ్లెటిక్స్ ఎంచుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 200 మీటర్ల పరుగులో స్వర్ణం, 100 మీటర్ల పరుగులో కాంస్య పతకాలతో ప్రతిభ కనబరిచారు. నాలుగు జాతీయ, ఆరు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న కైఫ్ స్ప్రింట్స్‌లో రికార్డు టైమింగ్ సృష్టిస్తానని చెబుతున్నారు.

భారత జట్టులో చోటు కోసం..


సబ్బావత్ దత్తు

నల్గొండకు చెందిన దత్తు నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ రెండో ఏడాది చదువుతున్నారు. లాంగ్‌జంప్, హెప్టాథ్లాన్‌లో తనదైన ప్రదర్శనతో పతకాలు సాధిస్తున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు స్వర్ణాలు కైవసం చేసుకున్నారు. నిరుపేద రైతు కుటుంబానికి చెందిన దత్తుకు 'లక్ష్య' కేంద్రం అండగా ఉంటూ ఉచితంగా నైపుణ్య శిక్షణ అందిస్తోంది. ఇప్పటివరకు ఐదు జాతీయ స్థాయి, 14 రాష్ట్రా స్థాయి టోర్నీల్లో పాల్గొన్నారు. భారత అథ్లెటిక్స్ బృందంలో చోటు సంపాదిస్తానని అంటున్నారు.

రెండు విభాగాల్లో..


రవితేజ

మంచిర్యాలకు చెందిన రవితేజ 3000 మీటర్ల(ఫ్లాట్ రన్), 3000 మీటర్ల స్టిపుల్ చేస్‌లో అత్యంత ప్రతిభతో రాణించాడు. రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో రెండు విభాగాల్లో కాంస్య పతకాలు కొల్లగొట్టాడు. జాతీయ స్థాయిలో నాలుగు, రాష్ట్ర స్థాయిలో 9 టోర్నీల్లో పాల్గొన్నాడు. అండర్-20 3000 మీటర్ల స్టిపుల్ ఛేస్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాలని లక్ష్యంగా సాధన కొనసాగిస్తున్నారు. హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో రెండో ఏడాది చదువుతున్నారు.

రికార్డు టైమింగ్ నమోదు


గణేష్

హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో గణేష్ రికార్డు టైమింగ్ నమోదు చేశారు. 100 మీటర్ల పరుగును 10.83 సెకండ్లలో పూర్తి చేశారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ టైమింగ్‌గా కోచ్ నాగరాజు తెలిపారు. నల్గొండకు చెందిన రవితేజ హనుమకొండలోని కేడీసీలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నారు. రెండేళ్ల క్రితమే రవితేజ 'లక్ష్య'లో చేరారు. నైపుణ్య శిక్షణ అందడంతో పరుగుకు మరింత పదును పెంచారు. మెరుగైన ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలోను రికార్డు టైమింగ్ నమోదు చేస్తానని తెలిపారు.

హనుమకొండ జేఎన్ స్టేడియం కేంద్రం

2019లో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం కేంద్రంగా ఈనాడు 'లక్ష్య' అథ్లెటిక్స్ శిక్షణ శిబిరం ప్రారంభమైంది. వరంగల్‌కు చెందిన భారత అథ్లెటిక్స్ జట్టు చీఫ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ సూచనతో జాతీయ స్థాయి అథ్లెట్ నాగరాజును కోచ్‌గా ఎంపిక చేశారు. కొద్ది మందితో ప్రారంభమైన శిక్షణ అంచెలంచెలుగా జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటే వరకు చేరారు. ప్రస్తుతం 18 బాలురు, ఒక బాలిక తర్ఫీదు పొందుతున్నారు. వారిలో 15 మంది జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. దత్తు, గణేష్ జాతీయ స్థాయిలో ఏకంగా పతకాలు కొల్లగొట్టారు.

దక్షిణ భారత పోటీలకు..

ఇటీవల హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో వరంగల్ లక్ష్య అథ్లెట్లు ఏకంగా పది పతకాలు సొంతం చేసుకున్నారు. దత్తు, కైఫ్, గణేష్, శ్రీధర్, రాఘవ, రవితేజ, తరుణ్‌కుమార్ తమ విభాగాల్లో అద్భుత ప్రదర్శనతో పతకాలు సాధించారు. కైఫ్, గణేష్, శ్రీధర్, రవితేజ, దత్తులు గుంటూరులో అక్టోబర్ 19, 20న జరిగే దక్షిణ భారత అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. పోటీల్లో దత్తు, కైఫ్, రవితేజ రెండేసి పతకాలతో సత్తాచాటారు.


హనుమకొండ జేఎన్ స్టేడియంలో శిక్షణలో ఉన్న అథ్లెట్లతో లక్ష్య మెంటర్ నాగపురి రమేష్ (పాత చిత్రం)

ఆర్మీ ఉద్యోగాలకు ఎంపిక


లక్ష్య శిక్షణ శిబిరానికి చెందిన అథ్లెట్లు 2022, 2023 సంవత్సరాల్లో ఆర్మీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారిలో నిరోష్, ఆదిత్య కృష్ణ, రోహిత్, శ్రీను, ప్రవీణ్, అభినవ్, రఘునాథ్, సింగ్, నగేష్ శ్రావణ్‌లు ఉన్నారు. ప్రస్తుతం దేశంలోని వివిధ సైనిక శిబిరాల్లో శిక్షణలో ఉన్నారు.


జనగామ కలెక్టరేట్‌లో ప్రారంభించి భోజనం చేస్తున్న ఎంపీ కావ్య, కలెక్టర్ రిజ్వాన్‌బాషా, తదితరులు

మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో జనగామ జిల్లా సచివాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను పాలనాధికారి రిజ్వాన్ బాషాతో కలిసి వరంగల్ ఎంపీ కడియం కావ్య బుధవారం ప్రారంభించి, నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో కలిసి భోజనం చేశారు. కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మంచి నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను అందించాలని నిర్వాహకులకు ఎంపీ సూచించారు. అనంతరం బిల్లు చెల్లిస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ములుగు జిల్లా కలెక్టర్ పేరిట నకిలీ ఖాతా



ములుగు, న్యూస్‌టుడే: ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ పేరుతో సైబర్ నేరగాళ్లు నకిలీ ఫేస్ బుక్ ఖాతా తెరిచి పలువురికి మెసేజ్‌లు పంపిస్తూ డబ్బులు అడుగుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన కలెక్టర్ అప్రమత్తమై మోసపూరిత మెసేజ్‌లను నమ్మొద్దని, వెంటనే దానిని తొలగించాలని పేర్కొంటూ ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ పేరులో సమావేశంలో ఉన్నానని అత్యవసరంగా డబ్బులు కావాలని 998886747021 ఉజ్బెకిస్తాన్ నంబర్ నుంచి పలువురికి ఈ సందేశం పంపించి సైబర్ నేరగాడు డబ్బులు ఫోన్ పే చేసి స్క్రీన్ షాట్ షేర్ చేయాలని కోరాడు. దీంతో కలెక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ఫేస్‌బుక్ అకౌంట్ ద్వారా అందరిని అప్రమత్తం చేశారు. తన పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే ఇవ్వొద్దని సూచించారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శిక్షణ ఎస్సైలకు ఠాణాల కేటాయింపు

వరంగల్‌క్రైం : పోలీసు శాఖలో ఎంపికై శిక్షణకు కమిషనరేట్‌కు వచ్చిన ఎస్సైలకు ఠాణాలు కేటాయించారు. రెండు ఠాణాల్లో 15 రోజుల చొప్పున విధులు నిర్వర్తించాలి. వివిధ అంశాలపై సీనియర్ అధికారులు అవగాహన కల్పిస్తారు. ఈ నెల 25 నుంచి అక్టోబర్ 9 వరకు, అక్టోబర్ 10 నుంచి 24 వరకు రెండు విడతల్లో శిక్షణ పొందుతారు.

ప్రతిభ చాటేందుకు.. యువజనోత్సవం

స్వామి వివేకానందుడి జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం యువజన సర్వీసుల ఆధ్వర్యంలో ఏటా యువజనోత్సవం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా యువత ప్రతిభ చాటేందుకు అవకాశం కల్పిస్తోంది. రాష్ట్ర సంచాలకుడు, యువజన సర్వీసుల శాఖల ఆదేశాల మేరకు పాలనాధికారి అధ్యక్షతన జిల్లా యువజన, క్రీడల ఆధ్వర్యంలో ఈ నెల 28న యువజనోత్సవాలను నిర్వహించనున్నారు. జానపద నృత్యాలు, జానపద గేయాలు విభాగంలో వ్యక్తిగత, బృంద పోటీలు ఉంటాయి. కవిత్వం, వ్యాసరచన, పోస్టర్ రూపకల్పన, వక్తృత్వ పోటీలు ఉంటాయి. సైన్స్ మేళాను యువజనోత్సవాల్లో మొదటిసారి ప్రవేశపెట్టారు. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా ఈ పోటీలు ప్రవేశపెట్టారు. యువత సొంతంగా తయారు చేసిన ప్రాజెక్టులు, నమూనాలు ప్రదర్శించవచ్చు. యువకృతి విభాగంలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన హస్తకళలను అర్థం చేసుకోడానికి యువజన క్రీడల శాఖ అవకాశం కల్పిస్తోంది. దీని కోసం హస్త కళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తులు, తదితర అంశాలపై గరిష్ఠంగా ఇద్దరు వ్యక్తులు ముఖాముఖిలో పాల్గొనేందుకు అవకాశం ఉంది. యువజనోత్సవాలను యువతీ యువకులకు మూడు దశల్లో పోటీలు నిర్వహిస్తారు. మొదటి దశ జిల్లా స్థాయిలో ఈ నెల 28న, రెండో దశ హైదరాబాద్‌లో, మూడో దశ జనవరి 12-16 వరకు కర్ణాటకలో జాతీయ స్థాయి పోటీలు ఉంటాయి. 15 నుంచి 29 ఏళ్ల మధ్యనున్న యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ములుగు జిల్లా యువజన, క్రీడల అధికారి తుల రవి కోరారు.

–న్యూస్‌టుడే, ములుగు టౌన్


జానపద నృత్యం చేస్తున్న బృందం (పాత చిత్రం)



నైపుణ్య ప్రదర్శనకు.. కళా ఉత్సవ్

విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా వివిధ దశల్లో ప్రతిభ చాటేందుకు ఎన్‌సీఈఆర్టీ, తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్ సంయుక్తంగా 'కళా ఉత్సవ్' పేరుతో పలు రకాల పోటీలు నిర్వహిస్తున్నాయి. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పోటీల నిర్వహణకు విద్యాశాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. తొమ్మిది, పదో తరగతి, ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులు. విద్యార్థులు ఏదైనా కళను ప్రదర్శించవచ్చు. దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలి. మండల, జిల్లా స్థాయి పోటీలు జిల్లా విద్యాధికారుల సూచనల మేరకు ఈ నెలాఖరు నాటికి నిర్వహిస్తారు. అక్టోబరులో రాష్ట్ర స్థాయి, నవంబరులో జాతీయ స్థాయిలో పోటీలు జరగనున్నాయి. జాతీయ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన కళాకారులకు నగదు బహుమతులు, పథకాలు, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. స్వర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, థియేటర్, దృశ్యకళ, సంప్రదాయక కథ చెప్పడం వంటి అంశాలపై ప్రధానంగా పోటీలు ఉంటాయి. ఉప అంశాలైన జానపద, క్లాసికల్ నృత్యాలు, సంగీతం, సంప్రదాయ చిత్రాలు, హిందుస్థానీ, కర్ణాటక, జానపదం, చిత్రలేఖనం, శిల్పకళ, కథలు చెప్పడం, నాటకంలో కళాకారులు తమ ప్రతిభ చూపవచ్చు. 'వివిధ కళల్లో విద్యార్థులు ప్రతిభ చాటేందుకు 'కళా ఉత్సవ్' ఓ మంచి వేదిక.. జిల్లా విద్యాధికారి సూచనల మేరకు ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలని అకాడమిక్ క్వాలిటీ సమన్వయకర్త కె.లక్ష్మణ్ చెప్పారు.

– న్యూస్‌టుడే, భూపాలపల్లి, మానుకోట


నృత్యం చేస్తున్న విద్యార్థిని(పాతచిత్రం)

పనులు వేగిరం.. దక్కిన ఫలితం

ఎన్‌హెచ్‌సీ పోటీల్లో ఓరుగల్లు సత్తా

కార్పొరేషన్, న్యూస్‌టుడే: చారిత్రక ఓరుగల్లు మహా నగరానికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. మూడేళ్లుగా నిర్వహిస్తున్న నైబర్ హుడ్ ఛాలెంజ్(ఎన్‌హెచ్‌సీ) పోటీల్లో గ్రేటర్ వరంగల్ సత్తా చాటింది. బెంగళూరు, ఇండోర్, జబల్‌పూర్, కొచ్చితో పాటు వరంగల్ నగరానికి నైబర్ హుడ్ ఛాలెంజ్ పోటీల్లో 'ఎక్సలెన్స్ సర్టిఫికెట్' దక్కింది. బుధవారం దిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణశాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో స్మార్ట్‌సిటీ మిషన్ డైరెక్టర్ రాహుల్ కపూర్ చేతుల మీదుగా బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఏఈ కార్తీక్‌రెడ్డి ఎక్సలెన్స్ ధ్రువపత్రం అందుకున్నారు.


దిల్లీలో స్మార్ట్‌సిటీ ఎండీ రాహుల్ కపూర్ నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న గ్రేటర్ వరంగల్ ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, చిత్రంలో ఏఈ కార్తీక్‌రెడ్డి

ఎందుకు వచ్చిందంటే..!

దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన 100 స్మార్ట్‌సిటీ నగరాలకు మూడేళ్ల క్రితం మొదటి దశలో నర్చరింగ్ నైబర్ హుడ్ ఛాలెంజ్ పేరుతో నిధులు కేటాయించారు. స్మార్ట్‌సిటీ మిషన్ జారీ చేసిన నిర్ణీత సమయంలో అధికారులు వరంగల్ దేశాయిపేట ఎంహెచ్‌నగర్‌లో 56 గంటల్లో చిట్టి పార్కు ఏర్పాటు చేశారు. ఇదే విధంగా క్రిస్టియన్ కాలనీ, కరీమాబాద్ గుండుబావి, హనుమకొండ శ్రీనగర్ కాలనీలో పార్కులు సిద్ధం చేశారు. హనుమకొండ అంబేడ్కర్ కూడలిలో బుద్ధ ప్లాజాను నిర్ణీత సమయంలో పూర్తి చేశారు. ఈ వివరాలన్నీ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖకు పంపించారు. ఈ నేపథ్యంలో గుర్తింపు దక్కింది.

వరంగల్‌కు గర్వకారణం

- గుండు సుధారాణి, మేయర్

'నైబర్ హుడ్ ఛాలెంజ్' పోటీల్లో వరంగల్ నగరానికి ఎక్సలెన్స్ సర్టిఫికెట్ దక్కడం గర్వంగా ఉంది. ఈ స్ఫూర్తితో నగర సుందరీకరణ కొనసాగిస్తాం. రెండో దశ పోటీ కోసం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నిధులు ఇవ్వనుంది. వాటితో మరిన్ని పార్కులు అభివృద్ధి చేస్తాం.


పార్కు ముఖ ద్వారం పరిస్థితి ఇది


నిలిచిన వర్షం నీరు

సరిగమ.. నిర్వహణ మమ!

ఫోకస్


కూలిన స్తంభాలు

ఒకప్పుడు ఆ పార్కులోకి వెళ్తే సప్త స్వరాలు వింటున్న అనుభూతి కలిగేది. . శిల్ప సౌందర్యం, పచ్చని పరిసరాలు ఆహ్లాదంగా కనిపించేవి.. నేడు మాత్రం విరిగిన ముఖద్వారం తాలూకు శిల్పాలు, అక్కడక్కడా అందమైన శిల్పాలకు పెట్టిన లైట్లు దొంగలపాలయ్యాయి. నిర్వహణ లేక ఆ పార్కు ఇలా కనిపిస్తోంది. లక్షలు వెచ్చించి ఖర్చు చేసినా ఉపయోగం లేకుండా పోయింది. హనుమకొండలోని పద్మాక్షి రోడ్‌లోని సరిగమ పార్కు దుస్థితి ఇది. – ఈనాడు, హనుమకొండ


దొంగల పాలైన శిల్పాల ముందు లైట్లు

రాష్ట్రస్థాయి జూడో పోటీలు షురూ!

వరంగల్ క్రీడావిభాగం : రాష్ట్రస్థాయి జూడో పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) రాష్ట్రస్థాయి పోటీలు పోచమ్మమైదాన్ సమీపంలోని కెమిస్ట్రీ భవన్‌లో జరిగాయి. ముఖ్య అతిథిగా ఒలింపిక్ సంఘం కార్యదర్శి కైలాస్‌యాదవ్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి పది జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. ఎస్‌జీఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి దస్రునాయక్ మాట్లాడుతూ.. సుమారు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి కల్పించినట్లు వివరించారు. ఈ నెల 27 వరకు పోటీలు జరుగుతాయన్నారు. వివిధ జిల్లాల కోచ్‌లు, ప్రభుత్వ పీఈటీలు పాల్గొన్నారు.

ప్రతి మహిళ వ్యాపారవేత్త కావాలి


మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య, చిత్రంలో అదనపు కలెక్టర్, డీఆర్డీఓ

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి మహిళ సద్వినియోగం చేసుకుని వ్యాపారవేత్తలుగా ఎదిగి ఆదర్శంగా నిలవాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. బుధవారం జనగామ కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జిల్లా మహిళా సమాఖ్య 8వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై, ప్రసంగించారు. అతివలు మహిళా శక్తి పథకంతో ఆర్థిక స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. మహిళలను సంపద పరంగా పెంచాలని ఆర్థిక వృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుని వివిధ యూనిట్లను అందిస్తోందన్నారు. కలెక్టర్ రిజ్వాన్‌బాషా మాట్లాడుతూ.. పొదుపు సంఘాలద్వారా రుణాలు పొందిన అధికారులు కృషిచేయాలన్నారు. రుణాల రికవరీ పెరిగిందని, భవిష్యత్తులో రికవరీ ఇంకా పెంచాలన్నారు. అనంతరం ఎంపీ కావ్య, కలెక్టర్ రిజ్వాన్‌బాషా, అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, సంబంధిత శాఖల అధికారులను మహిళా సంఘం సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ వసంత, జడ్పీ సీఈఓ సరిత, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ లక్షణాల గుర్తింపునకు ప్రశస్త్

దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: పిల్లలకు దివ్యాంగ లక్షణాలు బాల్యంలోనే కనిపించినా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అంతగా శ్రద్ధ వహించకపోవడంతో వయస్సు పెరుగుతున్న కొద్దీ అది కనుపుతోంది. ఇందుకు నివారణగా వీరిని గుర్తించి చికిత్స అందిస్తే మెరుగైన జీవనం గడపగలరని జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి(ఎన్సీఈఆర్టీ) సంకల్పించింది. ఇందుకోసం దేశ వ్యాప్తంగా మూడంచెల నిర్ధారణ కార్యక్రమాలకు నిర్ణయించింది. ఇందులో భాగంగా రిసోర్సు పర్సన్లు ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి..

● విద్యార్థులు సచేతనంగా ఉన్న సమయంలో ఉపాధ్యాయుల సమక్షంలోనే ఎక్కువగా ఉంటారు. ఈ క్రమంలో వారిని పాఠశాలలో సునిశితంగా గమనించే వీలుంటుంది. వారిలో దివ్యాంగ లక్షణాలు ఉంటే గుర్తించడానికి 'ప్రశస్త్' యాప్‌ను రూపొందించింది. ప్రధానోపాధ్యాయుడి మొబైల్ చిరునామా ద్వారా యాప్ డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉంది. మొత్తం 21 రకాల వైకల్యాలను గుర్తించిన విద్యాశాఖ తొలుత విద్యార్థులను ఉపాధ్యాయుడు కనీసం రెండు వారాల పాటు గమనించి విద్యార్థి వివరాలను నమోదు చేయాలి. రెండో దశలో శిక్షణ పొందిన నిపుణులు గమనించినట్లు నమోదు, మూడో దశలో ఆ లక్షణాలున్న విద్యార్థి తల్లి లేదా తండ్రిని విడిగా పిలిపించి గుర్తించిన రుగ్మతలను వివరించి, అనుమతిస్తే పరీక్షకు పంపిస్తారు. చిన్నప్పుడే చికిత్స అందించకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని కౌన్సెలింగ్ నిపుణులతో కూడా తెలియజేస్తారు. వారి అనుమతితో విద్యార్థిని ఉన్నత స్థాయి పరీక్షలకు పంపించి, ధ్రువపత్రం అందజేస్తారు. అక్కడి నుంచి సదరు విద్యార్థి ప్రత్యేక ప్రతిభావంతుడిగా గుర్తింపబడతాడు. మొదట తనకు దివ్యాంగ లక్షణాలు పరీక్ష చేస్తున్నామనే భావన కలగకుండా రిసోర్సు పర్సన్లు జాగ్రత్తలు తీసుకుంటారు. మొదటి దశ నివేదికలు అక్టోబర్ 26వ తేదీ వరకు యాప్‌లో నమోదు చేయాలని సూచించారు.



ప్రశస్త్ యాప్ అంతర్జాల పుట

నేటి నుంచి మిషన్ భగీరథ సహాయకులకు శిక్షణ

భూపాలపల్లి రూరల్, న్యూస్‌టుడే: నల్లబెల్లిమిట్ కార్యక్రమంలో జిల్లాలోని మిషన్‌భగీరథ సహాయకులకు గురువారం నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మండలంలో నాలుగు రోజుల పాటు శిక్షణ ఉంటుందని, గ్రామాల్లోని పంపు ఆపరేటర్లు, స్థానికులను ఎంపిక చేస్తున్నారు. పైపులైన్లు, బోర్లకు మరమ్మతు, పైపులైన్ లీకేజీలు, నల్లా కనెక్షన్ల మరమ్మతులు తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు.

దళితుల సమస్యల పరిష్కారంలో విఫలం



మాట్లాడుతున్న డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్

భూపాలపల్లి, న్యూస్‌టుడే: దళితుల సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ అన్నారు. భూపాలపల్లిలో బుధవారం ఆ సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వ పనితీరు ఆమోదయోగ్యంగా లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరించే విధానాలు ప్రజాస్వామ్య ఉనికికే ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. ఇలాంటి విధానాలకు స్వస్తి పలకాలన్నారు. నాయకులు కాంతారావు, భద్రయ్య, జోసెఫ్, రవి, లావణ్య, సంధ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ నాయకుల నిరసన



భూపాలపల్లి, న్యూస్‌టుడే: గత ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సాధించిన వాస్తవ లాభాల్లో కార్మికులకు వాటా చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం స్థానిక సింగరేణి జీఎం కార్యాలయం ఎదుట టీబీజీకేఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఆ సంఘం కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు నల్లబెల్లి సదానందం మాట్లాడుతూ.. సింగరేణి సాధించిన మొత్తం లాభాల నుంచి కార్మికులకు వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నష్టం కలిగించేలా వ్యవహరించిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల పనితీరును వ్యతిరేకిస్తున్నామన్నారు. అనంతరం సింగరేణి ఎస్‌వోటు జీఎంకు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అవినాష్, కుమార్, మల్లారెడ్డి, నరేష్, సురేష్, రవీందర్, కిరణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీతో సమస్యల పరిష్కారం

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: ఐఎన్‌టీయూసీతోనే కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆర్జీ-3 ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి అన్నారు. ఏఎల్‌పీలో బుధవారం నిర్వహించిన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తున్నారన్నారు. గడ్డం తిరుపతియాదవ్, రామారావు, సత్రం సమ్మయ్య, సాయికృష్ణ, రామిల్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

హేతుబద్ధీకరణ జీవోను ఉపసంహరించుకోవాలి


మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి

కాటారం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ జీవోను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, ఎస్‌జీటీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో సమస్యలపై చర్చించారు. ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో అశాస్త్రీయమైందన్నారు. ప్రాథమిక పాఠశాలలను ఇద్దరు ఉపాధ్యాయులతో నిర్వహించడం కష్టమని, నాణ్యమైన విద్య ఎలా అందుతుందో పునరాలోచించాలని సూచించారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయుడు, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని డిమాండ్ చేశారు. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని, పెండింగ్ డీఏ, నూతన పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, కొత్త టీచర్లను వెంటనే నియమించాలని కోరారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సేవానాయక్, ప్రధాన కార్యదర్శి జగపతిరావు, ఉపాధ్యక్షులు రాజబాబు, సాంబయ్య, మండల అధ్యక్షుడు సతీష్, నాయకుడు రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: నెంబర్ ప్లేట్లు, సంబంధిత పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని భూపాలపల్లి ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో నిత్యం వాహనాల తనిఖీ చేపడుతున్నామన్నారు. రోజూ సుమారు 15 ద్విచక్రవాహనాలను పట్టుకొని స్టేషన్‌కు తీసుకొస్తున్నామన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు.

రేకుల షెడ్డు కూల్చివేత

భూపాలపల్లి, న్యూస్‌టుడే: కొంపెల్లి శివారులోని జవహర్‌నగర్ కాలనీ సమీపంలో 170-3-1 సర్వే నెంబర్‌లోని అసైన్డ్ భూమిలో అనుమతి లేకుండా నిర్మించిన రేకులషెడ్డును కూల్చివేసేందుకు బుధవారం రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు వెళ్లగా బాధితులు అడ్డుకొని వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసుల సహకారంతో షెడ్డును కూల్చివేసినట్లు తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వ, అసైన్డు భూముల్లో అక్రమంగా కట్టడాలు చేపడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు.

స్థలం కేటాయించాలని వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే జీఎస్సార్

గణపురం, న్యూస్‌టుడే: భూపాలపల్లిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్‌శర్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, వర్కింగ్ అధ్యక్షుడు పిప్పాల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


ధన్వాడలో..

కాటారం, న్యూస్‌టుడే: ధన్వాడ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు బుధవారం పోషకాహార ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. సంపూర్ణ ఆరోగ్యానికి పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఆకుకూరలు, చిరుధాన్యాలు, కూరగాయలతో ప్రదర్శన నిర్వహించారు. సూపర్‌వైజర్ వీణ, ఎంఎల్‌హెచ్‌పీ వందన, టీచర్లు కే.శ్రీలత, రజిత, పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి పాల్గొన్నారు.

చిట్యాల : చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించేందుకు పోష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సీడీపీవో అవంతిక, వైద్యాధికారి రాగళ్ల మౌనిక అన్నారు. చిట్యాలలోని 1, 5వ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాల్లో భాగంగా గ్రోత్‌మేళా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ప్రతి నెలా చిన్నారుల ఎత్తు, బరువులను సరిచూసుకోవాలన్నారు. చిన్నారులకు అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద, అంగన్‌వాడీలు సంధ్యారాణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పలిమెల : పలిమెలలోని అంగన్‌వాడీ కేంద్రంలో.. అంబటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు రఘురామ్ పిల్లలకు అందించే పోషకాహారంపై అవగాహన కల్పించారు. పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి విటమిన్ ఏ, మందులు అందించారు. పిల్లలకు సరైన సమయంలో టీకాలు వేయించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఆహారంలో ఆకు కూరలు, చిరుధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివారాణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బతుకు పోరాటం.. జీవాలకు ఆహారం



మంచిర్యాల జిల్లాలోని భీమిని మండలానికి చెందిన గొర్రెల పెంపకందారులు జీవాలకు మేత కోసం సంచార జీవనం సాగిస్తున్నారు. పచ్చిక మైదానాలను వెతుకుతూ భూపాలపల్లి మండలంలోని ఆజంనగర్ ప్రాంతానికి వచ్చారు. ఐదు కుటుంబాలకు చెందిన వారు అటవీప్రాంతంలో తాత్కాలికంగా గుడారాలను ఏర్పాటు చేసుకున్నారు. పిల్లలను తమ అత్తామామల వద్ద వదిలి వచ్చినట్లు మహిళలు తెలిపారు. ఒక్కో కుటుంబానికి 200 గొర్రెలు ఉన్నట్లు తెలిపారు.

- న్యూస్‌టుడే, మహాముత్తారం

నాణ్యతా ప్రమాణాలతో నియంత్రికల మరమ్మతు


మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

బాలసముద్రం: విద్యుత్తు నియంత్రికల మరమ్మతులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, ఈ మేరకు తగిన జాగ్రత్తలు పాటించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. ఎస్పీఎం షెడ్ల నిర్వాహకులు, అందులో పని చేసే సిబ్బందికి హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్తు భవన్‌లో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. నియంత్రికల వైఫల్యాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి జిల్లాలో ఆదర్శవంతంగా ఎస్పీఎం షెడ్లు నెలకొల్పుతామని అన్నారు. ఈ నెల 29 వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయని చెప్పారు. విద్యుత్తు భవన్ అధికారులు సదర్‌లాల్, మధుసూదన్, కేవీఎస్.గుట్ట, అన్నపూర్ణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కరవుభత్యం బకాయిలు చెల్లించాలి


పర్లపల్లిలో సభ్యత్వాలు అందజేస్తున్న నాయకులు

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కరవు భత్యం బకాయిలను వెంటనే చెల్లించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందుకూరి దేవదాసు, భూపాలపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు గట్ల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. మొగుళ్లపల్లి, రంగాపూర్, ఇస్సిపేట, పాత ఇస్సిపేట, చింతలపల్లి, మేదరమెట్ల, ఆరేపల్లి, పర్లపల్లి గ్రామాల్లో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రుల్లో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నగదు రహిత వైద్యసదుపాయం కల్పించాలని కోరారు. ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన లింగాల కుమారస్వామిని ఎంఈవో కార్యాలయంలో కలిసి శుభకాంక్షలు తెలిపారు. సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిరాజుద్దీన్, సదానందం, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు శిక్షణ

కాటారం, న్యూస్‌టుడే: ధన్వాడలో బుధవారం కల్లు గీత కార్మికులకు కాటమయ్య రక్ష కవచంపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కల్లు గీసే సమయంలో కార్మికులు రక్షణ చర్యలు పాటించాలని ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య సూచించారు. కవచాన్ని ఉపయోగించే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శిక్షకులు జశ్వంత్, తిరుపతి, అంజన్న, అశోక్, వెంకట్రాజం, గీత కార్మిక సంఘం అధ్యక్షుడు లింగంగౌడ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు


సత్కారం పొందిన ఉపాధ్యాయులు

చిట్యాల, న్యూస్‌టుడే: నేటి బాలలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని తహసీల్దార్ హేమ అన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో గురు వందనం కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు కానుగుల రఘుపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించారు. ఎంపీడీవో రామకృష్ణ, ఎంఈవో రఘుపతి, పులి సరోత్తంరెడ్డి, బుర్ర సదయ్య, జిల్లా అధ్యక్షుడు తిరుపతి, ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గోపగాని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

కాటారం, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ మండల కార్యవర్గాన్ని బుధవారం కాటారంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొల్లం సతీష్, ప్రధాన కార్యదర్శిగా గండు రాజబాబు, ఉపాధ్యక్షులుగా సంపత్, శ్రీలత, కార్యదర్శులుగా రవీందర్, శ్రీకాంత్, జిల్లా కౌన్సిలర్లుగా జయరాజు, రాజబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా జిల్లా అధ్యక్షుడు బానోత్ సేవానాయక్, అధికారిగా జిల్లా ప్రధాన కార్యదర్శి జగపతిరావు వ్యవహరించారు.

మహాసభలను విజయవంతం చేయండి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏవైఎస్ నాయకులు

చిట్యాల, న్యూస్‌టుడే: హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 29న నిర్వహించనున్న అంబేడ్కర్ యువజన సంఘం వార్షికోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పుల్ల మల్లయ్య తెలిపారు. చిట్యాలలో బుధవారం మండలాధ్యక్షుడు సరిగొమ్ముల రాజేందర్ ఆధ్వర్యంలో మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గుర్రపు రాజేందర్, పుల్ల ప్రతాప్, గురుకుంట్ల కిరణ్, కనకం తిరుపతి, దాసారపు నరేశ్, పాముకుంట్ల చందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

గైర్హాజరైన కార్మికులకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సింగరేణి అధికారులు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: భూపాలపల్లి ఏరియాలోని మైన్స్ రెస్క్యూ స్టేషన్ సమావేశ మందిరంలో బుధవారం రెండో విడత గైర్హాజరైన కార్మికులకు అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్‌వోటు జీఎం కవీంద్ర మాట్లాడుతూ.. మూడేళ్లుగా 51 నుంచి వంద మస్టర్ల కంటే తక్కువగా హాజరైన ఉద్యోగులు డివిజన్‌లో 108 మంది ఉండగా, 46 మంది కౌన్సెలింగ్‌కు హాజరైనట్లు తెలిపారు. జీఎం కార్యాలయంలో ఒప్పంద కార్మికుల హాజరు విధానాన్ని ప్రత్యేక వెబ్‌సైట్‌లో నమోదు చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు మారుతి, క్రాంతికుమార్, కార్మిక సంఘాల నాయకులు బుచ్చయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తపస్ మండలాధ్యక్షురాలిగా అరవింద

రేగొండ, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండలాధ్యక్షురాలిగా అరవిందను ఎన్నుకున్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నేతలు విజయ్‌కుమార్, భాస్కర్, నవీన్, బాపురెడ్డి, సాగర్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాల గుర్తింపు శిబిరం

మహదేవపూర్, న్యూస్‌టుడే : మహదేవపూర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం దివ్యాంగులకు సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరం నిర్వహించారు. మహదేవపూర్, పలిమెల మండలాలకు చెందిన 140 మంది దివ్యాంగులు హాజరయ్యారు. శిబిరాన్ని జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రహ్లాద్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మహదేవపూర్ ప్రాజెక్టు సీడీపీవో రాధిక పాల్గొన్నారు.

ప్రశస్త్ యాప్‌పై అవగాహన


వివరిస్తున్న ఎంఈవో రఘుపతి

చిట్యాల, న్యూస్‌టుడే: ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను గుర్తించేందుకు ప్రశస్త యాప్ ఉపయోగకరంగా ఉంటుందని ఎంఈవో రఘుపతి తెలిపారు. స్థానిక జడ్పీ ఉన్నతపాఠశాలలో బుధవారం ప్రశస్త యాప్‌పై హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ. . ఈ యాప్ ద్వారా 21 రకాల వైకల్యాలను గుర్తించవచ్చున్నారు. విద్యార్థుల వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఎన్‌వో కృష్ణ, సీఆర్పీ నరేశ్, ఆర్పీలు కిరణ్‌కుమార్, మహేందర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘తెలుగు వర్సిటీ పేరు మార్చొద్దు’


సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాటారం, న్యూస్‌టుడే: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్చొద్దంటూ బుధవారం ఆర్యవైశ్య సంఘం నాయకులు నిరసన తెలిపారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. పొట్టి శ్రీరాములు పేరును తొలగించడం సమంజసం కాదని, ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్, రవీందర్, మూర్తి, లక్ష్మీనరసింహమూర్తి, శ్రీనివాస్, నగేష్‌కుమార్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి


వివరిస్తున్న వాలంటీర్ తిరుపతి

చిట్యాల, న్యూస్‌టుడే: ఈ నెల 28న నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకవోవాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ మండల పారా లీగల్ వాలంటీర్ ఆరెపల్లి తిరుపతి అన్నారు. ఆయన బుధవారం చిట్యాలలో స్థానికులతో మాట్లాడారు. వివిధ కేసుల్లో సత్వర న్యాయం అందుతుందన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎంఈవోలు


కుమారస్వామి


వెంకటరాజం

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే: మొగుళ్లపల్లి ఎంఈఓగా మొట్లపల్లి కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లింగాల కుమారస్వామి బుధవారం బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. సిబ్బంది చంద్రమౌళి, వేణు, సదయ్య, సురేందర్, వసంత, రమాదేవి, రమేష్ పాల్గొన్నారు.

మహదేవపూర్ : మహదేవపూర్ ఎంఈవోగా బొమ్మాపూర్ జడ్పీ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి. శంకరయ్య బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆయనను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో రాజు, శ్రీను పాల్గొన్నారు.

పలిమెల: మహదేవపూర్ మండలం అంబటిపల్లి ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరాజం.. పలిమెల ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించారు.

బొగ్గు బాయి ముచ్చట్లు

లాభాలను పక్కదారి పట్టిస్తున్న ప్రభుత్వం

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణి లాభాలను యాజమాన్యం, ప్రభుత్వం కలిసి పక్కదారి పట్టిస్తున్నాయని సీఐటీయూ నాయకుడు ఎం. నర్సింహరావు ఆరోపించారు. జీడీకే-11 గనిపై బుధవారం నిర్వహించిన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడారు. నికర లాభాన్ని ఏఐటీయూసీ నాయకులు స్థూల లాభంగా చెప్పడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి నిధులను వాడుకోవడానికి ప్రయత్నిస్తుందని.. సంస్థను కాపాడుకోవడానికి కార్మికులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. నాయకులు రాజమౌళి, శ్రీనివాస్, నరహరిరావు, మహేశ్, గజేంద్ర, మల్లేశ్, నవీన్‌కుమార్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఖాతాలో జమ చేయాలని వినతి

గోదావరిఖని, న్యూస్‌టుడే: ఒప్పంద కార్మికులకు ప్రకటించిన లాభాల వాటా రూ.5000 నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేయాలని డ్రైవర్లు బుధవారం ఆర్జీ-1 పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. దసరా లోపు జమ చేయాలని విన్నవించారు.

ఐఎఫ్‌టీయూ నేతకు నివాళి

గోదావరిఖని, న్యూస్‌టుడే: అనారోగ్యంతో మృతి చెందిన ఐఎఫ్‌టీయూ నాయకుడు అర్జున్‌రావుకు కార్మిక నాయకులు బుధవారం నివాళులర్పించారు. స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సంతాపం ప్రకటించారు. ఐఎఫ్‌టీయూ నిర్మాణంలో పూర్తిస్థాయిలో పని చేసిన అర్జున్‌రావు మృతి తీరని లోటన్నారు.

రేపు డయల్ యువర్ ఆర్జీ-I జీఎం

గోదావరిఖని, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యల పరిష్కారానికి డయల్ యువర్ ఆర్జీ-1 జీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్న డయల్ యువర్ జీఎం కార్యక్రమంలో 08728-244112 నంబరుకు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలని కోరారు.

భారాస హయాంలో సింగరేణి అద్భుత ప్రగతి

గోదావరిఖని, న్యూస్‌టుడే: భారాస ప్రభుత్వ హయాంలో సింగరేణి అద్భుత ప్రగతి సాధించిందని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. గోదావరిఖనిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ ప్రతి సంవత్సరం పెరిగిన లాభాలకు అనుగుణంగా వాటాను కార్మికులకు పంపిణీ చేస్తు వచ్చారన్నారు. 19 వేల మంది సింగరేణి వారసులకు ఉద్యోగాలు కల్పించారని, ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు వడ్డీలేని రుణం చెల్లించారని వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే వాస్తవం తెలియకుండా మాట్లాడుతున్నారన్నారు.

కార్మికులకు కార్పొరేట్ వైద్యం

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణి ప్రాంతంలో కార్పొరేట్ స్థాయి ఆస్పత్రిని నిర్మించాలని బీఎంఎస్ నాయకుడు వై.సత్తయ్య డిమాండ్ చేశారు. జీడీకే 2-ఎ గనిపై బుధవారం నిర్వహించిన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి గురువారం జీఎం కార్యాలయం ముందు తలపెట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు మహేశ్, సారంగపాణి, రవీందర్, లక్ష్మయ్య, సాంబయ్య, వెంకటస్వామి, పాల్గొన్నారు.

ఒప్పంద కార్మికులకు హైపవర్ వేతనాల చెల్లింపునకు కృషి

గోదావరిఖని, న్యూస్‌టుడే: కోల్ ఇండియా మాదిరిగా ఒప్పంద కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించే విధంగా కృషి చేస్తామని ఐఎన్టీయూసీ నాయకుడు, రాష్ట్ర కనీస వేతన సలహా మండలి ఛైర్మన్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. గోదావరిఖనిలో బుధవారం ఐఎన్టీయూసీ కార్యాలయంలో ఒప్పంద కార్మికులతో ఆయన మాట్లాడారు. వందేళ్ల చరిత్ర ఉన్న సింగరేణిలో ఇప్పటి వరకు ఒప్పంద కార్మికులకు లాభాల వాటా పంపిణీ చేసింది లేదన్నారు. ఇది ఐఎన్టీయూసీ నాయకత్వంతోనే సాధ్యమైందన్నారు. నాయకులు ధర్మపురి, సమ్మయ్య, శంకర్‌రావు, శ్యామ్, లక్ష్మీపతిగౌడ్, వికాస్‌కుమార్, దాస్ పాల్గొన్నారు.

హోటల్ గదిలో యువకుడి ఆత్మహత్య


అక్షయ్‌కుమార్(పాతచిత్రం)

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్‌లోని లాడ్జ్‌లో ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మార్కెట్ పోలీసుల సమాచారం ప్రకారం.. వరంగల్ జిల్లా భూపాల్‌పల్లికి చెందిన అక్షయ్‌కుమార్(24) ఐటీఐ ఫిట్టర్ పూర్తి చేశాడు. గతేడాది హైదరాబాద్‌కు వచ్చి కొంతకాలం ఉద్యోగం చేశాడు. కొత్త బైక్ కొనుగోలు చేసి కొద్దిరోజుల క్రితమే సొంతూరు వెళ్లాడు. తిరిగి మంగళవారం రాత్రి సికింద్రాబాద్ వచ్చాడు. బండిమెట్‌లోని ఒక లాడ్జ్‌లో గది అద్దెకు తీసుకున్నాడు. బుధవారం ఉదయం మిత్రులు, కుటుంబసభ్యుల్లో ఇష్టమైన వాళ్ల ఫొటోలను వాట్సాప్ స్టేటస్‌గా పెట్టాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అనుమానంతో అతడికి ఫోన్‌చేసినా స్పందన రాలేదు. స్విచ్ఛాఫ్ అయినట్టు గుర్తించారు. సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా కుటుంబసభ్యులు రాత్రి లాడ్జ్‌కు వచ్చారు. గదిలో చూడగా ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేపట్టారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.